సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం | 29 | ఫిబ్రవరి | 2024



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయ ఆవరణలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి పడాల నారాయణరాజు, స్వప్న దంపతులు (తాడేపల్లిగూడెం) రూ.51,116 విరాళంగా ఇచ్చారు.



యువతకు అన్నింటా అవకాశాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యువతకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించి, వారి భవితకు బాటలు వేసిందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు.

8లో

8,970 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.25 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

దక్షిణ కాశీ పుణ్యక్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



పల్లంలో ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: పల్లం పంచాయతీ బ్రహ్మసమేత్యంలోని సముద్ర తీరం వెంబడి దక్షిణ కాశీ పుణ్యక్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తానని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. పల్లం పంచాయతీ బ్రహ్మ సమేత్యంలో స్వయం సిద్ధంగా వెలిసిన సంతాన ప్రదాత కాలభైరవస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సహకారంతో కాలభైరవస్వామి, బ్రహేశ్వర స్వామి, దుర్గమ్మ, గంగమ్మ, నవగ్రహాల నూతన ఆలయ సముదాయాన్ని నిర్మించారు. గత మూడు రోజుల నుంచి ఋత్వికుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ దంపతుల చేతుల మీదుగా నూతన ఆలయ ప్రతిష్ఠ, కాల భైరవ స్వామి, బ్రహ్మేశ్వరస్వామి, దుర్గమ్మ, గంగమ్మ, నవగ్రహాలు, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. అనంతరం సామూహిక అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ మల్లాడి వీరబాబ్జి, మాజీ సర్పంచ్ మల్లాడి నారాయణరావు, కోలాటి సత్యం, కోలా మీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కే ప్రజల మద్దతు



మానేపల్లిలో పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలు

పి.గన్నవరం: ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే రాష్ట్ర ప్రజలంతా మద్దతు పలుకుతున్నారని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని మానేపల్లి గ్రామంలో విప్పర్తి సమక్షంలో బుధవారం రాత్రి 500 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి విప్పర్తి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పితాని నర్సింహారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో విప్పర్తి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ఎదురు చూస్తున్నారని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు తోలేటి బంగారు నాయుడు, పితాని చంద్రకళ, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, మెల్లం మహాలక్ష్మీ ప్రసాద్, యన్నాబత్తుల నాగభూషణం, చిట్టూరి రవి, పితాని సురేష్, కొక్కిరి రవికుమార్, దేశిరాజు సీతారామయ్య, దొమ్మేటి సూర్య తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తుల సందడి



సత్యదేవుని దర్శనం కోసం ఆలయం వద్ద క్యూలో వేచిఉన్న భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో వివాహాలు జరుగుతుండడంతో ఆలయ ప్రాంగణంలో నవదంపతుల సందడి నెలకొంది. బుధవారం తెల్లవారుజామున రత్నగిరిపై వివిధ సత్రాలు, ఉచిత కల్యాణ మంటపాలలో వివాహాలు జరిగాయి. ఇవే ముహూర్తాలలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వివాహాలు చేసుకున్నవారు కూడా స్వామివారి ఆలయానికి తరలివచ్చారు. వీరంతా సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూ లు, వ్రత మంటపాలు, విశ్రాంత మంటపాలు నవదంపతులు, వారి బంధుమిత్రులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. బుధవారం సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 1,500 జరిగాయి. స్వామివారి దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు.

అన్నదాతకు అండదలం

- వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ సొమ్ము విడుదల
- మూడో విడతలో 1,65,656 మంది రైతులకు రూ.33.33 కోట్లు
- లబ్ధిదారులకు చెక్కులు అందించిన జేసీ నుపూర్ అజయ్



రైతులకు నమూనా చెక్కు అందిస్తున్న జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ సర్కారు రైతులకు చేయూత నిచ్చింది.. సాగులో అన్నింటా వెన్నంటే ఉంటోంది.. ఇందులో భాగంగా జిల్లాలో మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ సొమ్ము విడుదల అమలాపురం పట్టణంలో అట్టహాసంగా జరిగింది. తద్వారా రైతన్నలకు ఆర్థిక భరోసా అందించింది. వైఎస్సార్ రైతు భరోసా మూడో విడత సాయం కింద జిల్లాలో 1,65,656 మందికి రూ.33.33 కోట్ల లబ్ధి చేకూరిందని జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ తెలిపారు. బుధవారం పీఎం కిసాన్ వైఎస్సార్ రైతు భరోసా పథకం, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రాయితీని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల బ్యాంకు ఖాతాలకు వర్చువల్ విధానంలో జమ చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యుడు జిన్నూరి బాబి, హితకారిణి సమాజం చైర్ పర్సన్ కాశి బాల మునికుమారి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్‌ఖాదర్, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ డోలామణి, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ మొదటి విడత కింద గత ఏడాది జూన్‌లో 1,61,386 మంది రైతులకు రూ.89.92 కోట్లు అందించామన్నారు. అదేవిధంగా 5,505 కౌలు రైతులకు రూ.4.12 కోట్లు ఇచ్చామన్నారు. గత ఏడాది నవంబర్‌లో రెండో దశలో 1,65,382 మంది రైతులకు రూ.68 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని వివరించారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల కింద జిల్లాలో ఇప్పటి వరకూ 35,707 మంది రైతులకు రూ.5.37 కోట్లు విడుదల చేశామని జేసీ తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. విత్తు నుంచి పంట చేతికందే వరకూ అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని సిరుల పంట పండించాలని ఆకాంక్షించారు. ఈ చెక్కులను లబ్ధిదారులకు జాయింట్ కలెక్టర్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జిల్లా అధికారి బోసుబాబు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడికి కలసి వస్తోంది..



నేను సొంతంగా మూడు, కౌలుకు ఏడు ఎకరాల సాగు చేస్తున్నాను. రైతు భరోసా కింద ఇప్పటి వరకూ రూ.54 వేల సాయం అందింది. అలాగే వడ్డీ రాయితీ రూపంలో రూ.1,984 వచ్చింది. పంట నష్టపోయిన సందర్భంలో పెట్టుబడి రాయితీగా రూ.20 వేలు ఒకసారి, రూ.25 వేలు మరోసారి జమ అయ్యింది. అరటికి పంట బీమా రూపంలో రూ.25 వేలు వచ్చింది. రైతు భరోసాతో పెట్టుబడి చాలా వరకూ కలిసి వస్తోంది. రైతులకు ప్రతి సందర్భంలో అండగా ఉంటున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

–బండారు వెంకటరెడ్డి నాయుడు, వానపల్లి, కొత్తపేట మండలం

అప్పు చేయకుండానే సాగు



నేను రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. ప్రతి ఏడాది వైఎస్సార్ రైతు భరోసా కింద పంట పెట్టుబడి సాయం అందిస్తున్నారు. దీనివల్ల అప్పుల కోసం దళారుల ఆశ్రయించాల్సిన పని లేకుండా పోయింది. ఈ సొమ్ముతో ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేస్తున్నాను. గతంలో సాగు చేయాలంటే ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు ఆనందంగా ముందుకు వెళ్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న భరోసాతో వ్యవసాయం సాఫీగా సాగుతోంది.

–ముత్తాబత్తుల కామేశ్వరరావు, కౌలురైతు, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం



సమావేశంలో సీఎస్, డీఓలనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

పకడ్బందీగా పది పరీక్షలు

- పరీక్ష కేంద్రాల్లో సదుపాయాలకు ప్రాధాన్యం
- ఆర్‌జేడీ నాగమణి

ముమ్మిడివరం: పదో తరగతి పరీక్షలను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.నాగమణి సూచించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల సమావేశ భవనంలో బుధవారం పదో తరగతి పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆర్జేడీ నాగమణి మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. పరీక్షల్లో చిన్న విషయాలూ సెన్సిటివ్‌గా మారే అవకాశం ఉన్నందున ప్రతి విషయాన్ని సీరియస్‌గా పరిగణించాలన్నారు. గతేడాది మాదిరిగానే మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేని విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్ సదుపాయం, ఫర్నీచర్ వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యార్థులు ఎక్కడా కింద కూర్చుని రాయడానికి వీలు లేదన్నారు. ఫర్నీచర్ కొరత ఉంటే అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పరీక్ష పేపరుపై ప్రత్యేకంగా నంబర్‌ను ముద్రిస్తున్నందున లీకేజీ ఎక్కడ జరిగినా ఏ పరీక్ష కేంద్రం నుంచి లీక్ అయ్యిందో వెంటనే తెలుస్తుందన్నారు. పరీక్ష పేపర్లు స్వీకరించినప్పటి నుంచి పరీక్ష పూర్తయ్యే వరకూ ప్రతి దశలోనూ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి కమలకుమారి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు జిల్లాలో 112 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 21,113 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. సీనియర్ ఎంఈఓ బొజ్జా రమణశ్రీ, హెచ్‌ఎం బి.కామేశ్వరరావు మాట్లాడుతూ పది పరీక్షలు నిర్వహించే విధానంపై సీఎస్, డీఓలకు వివరించారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ నక్కా సురేష్, రామచంద్రపురం డీవైఈఓ శ్రీపాద నరసింహ ఫణి, డీసీఈబీ సెక్రటరీ బీర హనుమంతరావు, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్ బాబు, పి.రాంబాబు, ఎంఏకే భీమారావు తదితరులు పాల్గొన్నారు.

ఉమర్ ఆలీషా రచనల్లో స్త్రీజనాభ్యుదయం

కాకినాడ రూరల్: ఉమర్ ఆలీషా రచనల్లో స్త్రీ జనాభ్యుదయం ఉంటుందని డీపీఆర్వో నాగార్జున అన్నారు. స్థానిక బోట్‌క్లబ్ వద్ద గల కవి శేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా విగ్రహం వద్ద 139వ జయంతి సభకు ప్రస్తుత పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా సోదరుడు అహ్మద్ అలీషా అధ్యక్షత వహించారు. డీపీఆర్వో నాగార్జున ముఖ్యఅతిథిగా, ప్రస్తుత పీఠాధిపతి మరొక సోదరుడు హుస్సేన్ షా, కవి శిరీష, రిటైర్డ్ టీచర్ కేవీవీఎస్ ప్రసాద్ అతిథులుగా పాల్గొన్నారు. సభాధ్యక్షులు అహ్మద్ ఆలీషా మాట్లాడుతూ కవి శేఖర డాక్టర్ ఉమర్‌ఆలీషా స్వాతంత్ర్య సమర యోధుడిగా, ప్రజా ప్రతినిధిగా, పార్లమెంట్ మెంబర్‌గా, అభ్యుదయ రచయితగా, మానవతావాద ప్రవక్తగా కీర్తి గడించారన్నారు. ప్రసాద్ మాట్లాడుతూ ఆయన సుమారు 50 గ్రంథాలు రచించినట్టు తెలిపారు. హుస్సేన్ షా మాట్లాడుతూ స్త్రీ విద్యను వ్యతిరేకించే వారి పట్ల వారు వారి రచనల్లో చాలా తీవ్ర పదాలు ఉపయోగించేవారని తెలిపారు.

పసిప్రాణానికి కొండంత సాయం

- సీఎం రిలీఫ్ ఫండ్ కింద వైద్యానికి రూ.20 లక్షలు
- బాలుడు సాయితేజకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పరామర్శ



సాయితేజ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: ప్రభుత్వ సహకారంతో వైద్యం చేయించుకుని మృత్యుంజయుడిగా ఇంటికి తిరిగి వచ్చిన మండలంలోని సూర్యారావుపేటకు చెందిన టేకుమూడి సాయితేజను బుధవారం కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సాయితేజకు కాలేయానికి అరుదైన వ్యాధి సోకింది. కాలేయ మార్పిడి చేయాల్సి ఉందని, ఈ శస్త్రచికిత్సకు రూ.20 లక్షల ఖర్చు అవుతుందని కార్పొరేట్ వైద్యులు నిర్ధారించారు. నిరుపేద కుటుంబానికి చెందిన సాయితేజ కోసం అంత ఆర్థిక భారం భరించలేని తల్లిదండ్రులు శ్రీనివాసు, మహాలక్ష్మి ఆ విషయాన్ని వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సత్వరం స్పందించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ కోసం సీఎం వైఎస్ జగన్‌ను కలసి బాలుడు సాయితేజ పరిస్థితిని వివరించారు. దీంతో ఆయన రెండు విడతలుగా రూ.20 లక్షలు మంజూరు చేయగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి రవాణా ఖర్చుల కింద రూ.20 వేల అందజేశారు. దీంతో ఆ బాలుడికి ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్ గ్లోబల్ హాస్పిటల్‌లో మెరుగైన వైద్యం జరిగింది. సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి వచ్చిన అతన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్థానిక నాయకులతో కలసి కలుసుకున్నారు. తగిన విశ్రాంతి తీసుకుని ఎప్పటి మాదిరిగానే స్కూల్‌కు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి, సీఎం జగన్‌కు సాయితేజ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ చింతపల్లి వెంకటలక్ష్మి, కడలి ఉపేంద్ర, చింతపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువలో 'ఉపాధి' పనులు

- ఇప్పటికే 53.24 లక్షల పని దినాలు పూర్తి
- డ్వామా పీడీ మధుసూదన్



కొత్తపేటలో మాట్లాడుతున్న డ్వామా పీడీ మధుసూదన్

కొత్తపేట: జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేస్తున్నట్లు డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ తెలిపారు. కొత్తపేట మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి పథకం లక్ష్యాలు, పురోగతిని వివరించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 54 లక్షల పని దినాలకు సంబంధించి 19,157 పనులు లక్ష్యం కాగా నేటికి 53.24 లక్షలు (98.67 శాతం) పూర్తి చేశామన్నారు. మార్చి నెలాఖరుకు మిగిలిన పని దినాలు కూడా పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. మొత్తం పనుల విలువ రూ.242 కోట్లు కాగా, పూర్తయిన పనులకు సంబంధించి ఇప్పటి వరకూ రూ.207 కోట్లు చెల్లించామన్నారు. ఇందులో వేతనాలకు రూ.141 కోట్లు, మెటీరియల్‌కు రూ.58 కోట్లు, జీత భత్యాలు, కార్యాలయాల విద్యుత్ చార్జీలు, స్టేషనరీ, కంప్యూటర్ ప్రింటింగ్ మెటీరియల్ తదితరాల నిమిత్తం రూ.8 కోట్లు చెల్లించగా ఇంకా రూ.16 కోట్లు పెండింగ్‌లో ఉందన్నారు. సగటు వేతనం రూ.266.83 చెల్లించడం ద్వారా జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. 2024–25 సంవత్సరంలో 60 లక్షల పని దినాలకు సంబంధించి 19,157 పనులను గుర్తించామని అన్నారు. దీనికి ప్రణాళిక రూపొందించినట్టు పీడీ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకూ సుమారు 4,809 పనులకు అంచనాలు తయారుచేసి, రూ.93 కోట్ల విలువైన 3,090 పనులకు 31 లక్షల పనిదినాలకు పరిపాలనా ఆమోదం తీసుకున్నామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనుల్లో ఉద్యాన పంటల సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. అందుకు 2,300 ఎకరాలు లక్ష్యం కాగా, కొబ్బరి తోటల్లో అంతర పంటలుగా బత్తాయి, నిమ్మ, కోకో, మునగ, జామ, స్వీట్ ఆరంజ్ తదితర పండ్ల తోటల పెంపకానికి రైతులను ప్రోత్సహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పి.గన్నవరం, రామచంద్రపురం ఏపీడీలు జీవీకే మల్లికార్జునరావు, కె.సత్యనారాయణ, జిల్లా అంబుడ్స్‌మెన్ అడపా వెంకట శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎస్.వాణి, ఏపీఓ ఎస్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- ఎన్నికల సిబ్బందికి శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా, చిత్రంలో జేసీ నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: అన్ని శాఖల అధికారుల సమన్వయంతో వచ్చే సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు, వ్యయ పర్యవేక్షణలో ముఖ్య పాత్ర పోషించే ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్స్ తదితర అధికారులకు బాధ్యతల గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో షిఫ్ట్‌లో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పని చేస్తాయన్నారు. నగదు, మద్యం వంటివి పంపిణీ, రాజకీయ పార్టీలు, నాయకుల ఎన్నికల ఖర్చుకు సంబంధించిన ఫిర్యాదులు అందితే వీరు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన అనంతరం రాజకీయ పార్టీలు నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలను వీడియో సర్వైలెన్స్ టీమ్‌లతో చిత్రీకరించి వీడియో వ్యూయింగ్ టీమ్స్ సహాయంతో ఆయా పార్టీలు, వ్యక్తులు చేస్తున్న ఖర్చును అకౌంటింగ్ అధికారులకు పంపాలన్నారు. స్టాటిక్ సర్వైలెన్స్ టీములు ఎన్నికల ఖర్చులు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ మద్యం, పెద్ద మొత్తంలో నగదు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి తరలింపు తదితర వాటిపై నిఘా ఉంచుతారన్నారు. ఈ చెక్‌పోస్టుల వద్ద ప్రక్రియ మొత్తం వీడియో లేదా సీసీటీవీల ద్వారా రికార్డు చేస్తానని అన్నారు. వీడియో సర్వైలెన్స్, వీడియో వ్యూయింగ్ టీమ్స్‌లో ఒక అధికారితో పాటు ఒక వీడియో గ్రాఫర్ ఉంటారని, వీరు ఫ్లయింగ్ స్క్వాడ్ నేతృత్వంలో జిల్లాలో జరిగే రాజకీయ పార్టీల నాయకుల ర్యాలీలు, బహిరంగ సమావేశాలను వీడియో తీస్తారన్నారు. ఈ చిత్రాలను వీడియో వ్యూయింగ్ టీములు పరిశీలించి, రాజకీయ పార్టీల నాయకులు ఆయా ర్యాలీలు, సమావేశాల్లో చేస్తున్న ఖర్చును అంచనా వేసి వ్యయ పరిశీలకునికి నివేదిక పంపుతారన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా, అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.26 కోట్ల నిధుల మంజూరు

ఎంపీ చింతా అనురాధ



అల్లవరం: రక్షిత మంచి నీటి సమస్యను తీర్చిడానికి ఓఎన్జీసీ నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి రూ.1.26 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఎంపీ చింతా అనురాధ బుధవారం తెలిపారు. ఇప్పటికే ఓఎన్జీసీ, వేదాంత సంస్థల సహకారంతో రూ.3.65 కోట్ల నిధులతో 12 గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మండలంలోని ఉల్లింగివారిపేట, మాకేవారిపేట, కడదారి, రామేశ్వరం గ్రామాల్లో నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి మరో రూ.1.26 కోట్ల నిధులు ఓఎన్జీసీ మంజూరు చేసిందన్నారు. ఒక్కో గ్రామంలో రూ.31.50 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం కానుందని, త్వరలోనే పనులు మొదలవుతాయన్నారు. పల్లిపాలెం కాలనీ, మొగళ్లమూరు, గోడి, తుమ్మలపల్లి, ఉత్తరవారిపేట, గోడితిప్ప, గోడిలంక–పెనుమాలపేట, బెండమూర్లంక ఎస్.కొత్తపల్లి, దేవగుప్తం, డి.రావులపాలెం, చల్లపల్లి గ్రామాల్లో ప్రజలకు మంచి నీటి కష్టాలు తీరతాయని ఎంపీ చింతా అనురాధ తెలిపారు. నేడు విడుదలైన వాటితో కలిపితే 16 గ్రామాల్లో రూ.4.91 కోట్ల నిధులు మంజూరైనట్లని తెలిపారు. ఈ సందర్భంగా ఓఎన్జీసీ, వేదాంత సంస్థలకు ఎంపీ చింతా అనురాధ కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ విద్యార్థులు సమయ పాలన పాటించాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు

అమలాపురం రూరల్: ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు సమయ పాలన పాటించేలా చూడాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులకు ఇంటర్మీడియట్ కమిషనర్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సౌరభ్ గౌర్ సూచించారు. బుధవారం అమరావతి నుంచి ఆయన ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 26 జిల్లాల ఇంటర్ బోర్డు అధికారులకు పరీక్షల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు అమలాపురం కలెక్టరేట్ నుంచి ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌరభ్ గౌర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆయా పరీక్షల రోజుల్లో ఉదయం 8.30 నుంచి 9 గంటలలోపు పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించాలన్నారు. 9 గంటలు దాటిన తర్వాత విద్యార్థులను అనుమతించేది లేదన్నారు. పరీక్ష పూర్తిగా రాసినా సమయం పూర్తయ్యే వరకూ బయటకు పంపవద్దన్నారు. గతంలో ప్రశ్నపత్రం తీసుకుని విద్యార్థులను ప్రత్యేక పరిస్థితుల్లో బయటకు పంపించే ఏర్పాటు ఉండేదని, ఈ ఏడాది 12 గంటల వరకూ పరీక్ష గదిలో ఉండాల్సిందేనని అన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులకు ఒక గంట సమయాన్ని ఎక్కువగా కేటాయించాలన్నారు. అంటే ఒంటిగంట వరకూ పరీక్ష రాయవచ్చని కమిషనర్ సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వి.సోమశేఖరరావు, ఇంటర్ బోర్డు పబ్లిక్ పరీక్షల నిర్వహణ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి మృతి

ముమ్మిడివరం: మండలంలోని అనాతవరంలో ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ముమ్మిడివరం హెచ్‌సీ జి.భైరవస్వామి కథనం ప్రకారం.. అనాతవరానికి చెందిన విత్తనాల ఫణీంద్ర ఈ నెల 28న పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

ఐఎస్‌ఐ ప్రమాణాలు విధిగా పాటించాలి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు

కాకినాడ సిటీ: నిత్యావసర వస్తువులు మొదలుకొని ప్రభుత్వ రంగాల్లో వినియోగించే అన్ని వస్తువులకు ఐఎస్‌ఐ ప్రమాణాలు విధిగా పాటించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కాకినాడ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రతినిధి జాయింట్ డైరెక్టర్ టి.సుజాత అన్నారు. బుధవారం కాకినాడ జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో కాకినాడ రూరల్, తొండంగి, ప్రత్తిపాడు, తుని, రౌతులపూడి, కిర్లంపూడి, కోటనందూరు, పెదపూడి, కరప, పిఠాపురం, మండలాల పంచాయతీ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ నియమాలపై శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం వినియోగించే అన్ని వస్తువులకు ఐఎస్‌ఐ ప్రమాణాలు విధిగా పాటించాలని అన్నారు. పబ్లిక్ స్టాండర్డ్స్ ప్రమాణాలు గల వస్తువుల కొనుగోలుకు ప్రాధాన్యం ఇవ్వాలని శిక్షణలో పాల్గొన్న సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎ.రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై నేడు సమీక్ష

సామర్లకోట: స్థానిక కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై గురువారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నీలకంఠం తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆర్డీఓ కిశోర్ అధ్యక్షతన పెద్దాపురం, సామర్లకోటకు చెందిన వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఉంటుందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

నాలుగేళ్లకో నవ వసంతం



- మధుర స్మృతులకు వేదిక లీపు సంవత్సరం
- నేటి పుట్టిన, పెళ్లి రోజులకు ప్రత్యేకతలెన్నో..
- వేడుకలకు సిద్ధమవుతున్న బంధుమిత్రులు

కపిలేశ్వరపురం: ఏడాదిలో ఏదో ఒక రోజు మన జీవితంలో మధుర క్షణాలకు అలవాలంగా ఉంటోంది.. అందులో పుట్టిన రోజైనా, పెళ్లి రోజైనా, మరే ఇతర శుభకార్యమైనా ఎంతో ఆనందాన్ని పంచుతోంది. సంవత్సరానికి ఒకసారి వచ్చే పుట్టిన, పెళ్లి రోజులకే అంతటి ప్రాధాన్యం ఉంటే... మరి అదే లీప్ సంవత్సరంలో నాలుగేళ్లకోసారి వస్తే మరెంత ప్రత్యేకత ఉంటుందో చెప్పనక్కర్లేదు. సూర్యుని చుట్టూ భూ పరిభ్రమణ కాలానికి క్యాలెండర్ కాలానికి మధ్య ఉన్న వ్యత్యాసం కొన్ని జీవితాలకు మధురానుభూతులను మిగుల్చుతోంది. నాలుగేళ్లకు ఒకసారి ఫిబ్రవరిలో వచ్చే 29వ తేదీ మానవాళిని ఆశ్చర్యపరుస్తుంది. ఆ ఒక్క రోజులోని 24 గంటలు, 1,440 నిమిషాలు, 86,400 సెకన్లు ప్రపంచ వ్యాప్తంగా కొందరిలో ప్రత్యేక క్షణాలుగా నిలుస్తాయి. ఏడా**దికో పావు రోజు చొప్పున దాచుకొని ఒక ప్రత్యేక రోజుగా రూపాంతరం చెందిందే ఫిబ్రవరి 29 నేపథ్యం అన్నట్లు ఉంటోంది. నాలుగేళ్లకోసారి వచ్చే ఈ ఆనందం నాలుగు కాలాల పాటు కొనసాగాలి. ఫిబ్రవరి 29న పుట్టిన రోజు, పెళ్లి రోజు జరు**పుకొనే, జరుపుకొన్న వారికి శుభాకాంక్షలు చెబుతూ ఈ కథనం..

లీప్ సంవత్సర నేపథ్యం ఇదీ...

భూమి సూర్యుని చుట్టూ తిరిగి రావడాన్ని సంవత్సర కాలంగా పిలుస్తాం. దీనికి 365 రోజుల సమయం పడుతుంది. ఆ 365 రోజులనూ 12 నెలలుగా క్యాలెండర్‌లో పొందుపర్చుకుని వినియోగిస్తున్నాం. భూ పరిభ్రమణమనేది క్యాలెండర్‌లో చెప్పుకొన్నట్లు కచ్చితంగా అలానే ఉండదు. ఖగోళ సంవత్సరంలో 365 కంటే కొద్ది అధికంగా కూడా తిరుగుతూ ఉండటంతో క్యాలెండర్ సంవత్సరానికి, ఖగోళ సంవత్సరానికి మధ్య తేడా అనివార్యమవుతుంది.

జూలియస్ క్యాలెండర్ ప్రకారం ఏడాదికి 365 రోజులుగా సాగుతున్న క్రమంలో 1,582లో గ్రెగొరీ–13 మరింత శాస్త్రీయతను జోడిస్తూ నూతన క్యాలెండర్‌ను రూపొందించారు. 365 రోజులకు అదనంగా వచ్చే సమయాన్ని లెక్కకట్టి 4తో భాగించబడే సంవత్సరాన్ని లీపు సంవత్సరంగా చెప్పారు. గ్రెగోరియన్ క్యాలెండర్ ఆవిష్కరించినప్పటి నుంచి లీపు సంవత్సరం అమల్లోకి వచ్చింది. సాధారణ సంవత్సరాల్లో వచ్చే ఫిబ్రవరికి 28 రోజులు ఉండగా, లీపు సంవత్సరంలో వచ్చే ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.

ప్రత్యేక అనుభూతి ఇది..



నాలుగేళ్లకోసారి వచ్చే లీపు సంవత్సరంలోని 29న పెళ్లిరోజు జరుపుకోవడం ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుంది. గురువారం బలమైన ముహూర్తమని చెప్పడంతో మా పెద్దలు నా పెళ్లి నిశ్చయించారు. ఇకపై మా పెళ్లిరోజును ప్రత్యేక రోజైన లీపు సంవత్సరాల్లోని ఫిబ్రవరి 29న జరుపుకొంటూ ఉంటాం. జీవితంలో పెళ్లిరోజు అత్యంత మధుర ఘట్టం, అది లీపు సంవత్సరంలో జరుపుకొనే అవకాశం రావడం ఆనందకరం.

– చల్లా సుధీర్, ఆలమూరు

పదహారేళ్లలో నాలుగో పుట్టినరోజు



నేను ఇంటర్ చదువుతున్నాను. పదహారేళ్లలో ఇది నాకు నాలుగో పుట్టినరోజు. ఏటా నా స్నేహితురాళ్ల పుట్టినరోజుకు వెళ్తుంటాను. వారందరికీ హ్యాపీ బర్త్ డే చెబుతుంటాను. అదంతా ఒక ఎత్తయితే నా పుట్టినరోజు ఓ స్పెషల్. ఇది నాలుగేళ్లకోసారి రావడంతో స్నేహితులు, కుటుంబ సభ్యులు నాకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు చెబుతుంటారు. ఆ సమయం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూడడం, అంతా ఆశీర్వదించడం ఆనందాన్ని ఇస్తుంది.

–పొట్టుపోతు నాగ సత్యవెంకటలక్ష్మి, ఇందుపల్లి, అమలాపురం రూరల్

ఈ రోజు కోసం ఎదురు చూస్తాం..



మాది అంగర గ్రామం. ఉద్యోగం రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాం. మాకు 2012 ఫిబ్రవరి 29న వివాహమైంది. మాది దగ్గర సంబంధం. మా అనుబంధానికి ప్రతి లీప్ సంవత్సరం మరింత మధురానుభూతిని ఇస్తోంది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నా నాలుగేళ్లకు ఒకసారి పెళ్లిరోజున బంధుమిత్రులతో కలసి సంబరాలు చేసుకుంటాం. ఈ రోజు కోసం ఎంతో ఎదురు చూస్తుంటాం.

–వీరంశెట్టి సత్యప్రసాద్, రూపాదేవి దంపతులు, అంగర, కపిలేశ్వరపురం మండలం

కాంట్రాక్టర్‌పై హత్యాయత్నం

ఈదరపల్లి ఎంపీటీసీ సభ్యుడి నిర్వాకం



హత్యాయత్నం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ మహేశ్వరరావు, పట్టణ సీఐ క్రిస్టోఫర్

అమలాపురం టౌన్: అనుమానం పెనుభూతమై ఇంటి పక్క పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న కాంట్రాక్టర్‌పై ఓ ఎంపీటీసీ సభ్యుడు కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి ఒడిగట్టాడు. అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి కోదండ రామాలయం సమీపంలో ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యుడు అడపా సత్తిబాబు, కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ కొత్తపల్లి సుబ్రహ్మణ్యం ఓ డాబా ఇంటి పైఅంతస్తులో పోర్షన్లలో అద్దెకు ఉంటున్నారు. బుధవారం సుబ్రహ్మణ్యంపై ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు కత్తితో దాడి చేసి పలు వేట్లు వేయడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. తన భార్యతో సుబ్రహ్మణ్యం అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో అతనిపై హత్యాయత్నం చేసినట్లు ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు చెబుతున్నాడని పట్టణ సీఐ క్రిస్టోఫర్ వివరించారు. సంఘటనా స్థలాన్ని అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, సీఐ క్రిస్టోఫర్ పరిశీలించి హత్యాయత్నానికి దారి తీసిన పరిస్థితులపై విచారించారు. కత్తితో దాడి చేయడంతో డాబా వరండా రక్త సిక్తమైంది. దాడిలో తీవ్రంగా గాయపడిన సుబ్రహ్మణ్యాన్ని అతని భార్య తక్షణమే అత్యవసర వైద్యం నిమిత్తం స్థానిక కిమ్స్ ఆస్పత్రికి తరలించింది. సుబ్రహ్మణ్యం ప్రస్తుతం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, అతని ప్రాణానికి ఎలాంటి ప్రమాదం లేదని సీఐ క్రిస్టోఫర్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. అయితే సుబ్రహ్మణ్యంపై హత్యాయత్నం చేసిన తర్వాత ఎంపీటీసీ సత్తిబాబు కత్తితో సహా పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ముమ్మిడివరం: ఓ వృద్ధురాలి మెడలో రెండు కాసుల బంగారు గొలుసును మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు యువకులు దొంగిలించుకుపోయారు. ముమ్మిడివరం ఎస్సై డి.సురేష్‌బాబు కథనం ప్రకారం.. నగర పంచాయతీ బందరుపాలేనికి చెందిన కోళ్ల సత్యవతి బుధవారం ఓ వివాహ వేడుకకు వెళ్లేందుకు ఆటో కోసం ఎదురు చూస్తుండగా ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చారు. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ చూపి ఆ ఫోన్లో ఉన్న వ్యక్తులు తెలిసా అని అడిగారు. ఆమె తెలియదని చెప్పడంతో అక్కడ నుంచి కొంచెం దూరం వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చి ఆమె మెడలోని రూ.48 వేల విలువ చేసే బంగారు గొలుసును తెంచుకుని పోయారు. మోటారు సైకిల్‌పై వచ్చిన యువకులు ఎరుపు రంగు చొక్కాలు ధరించి ఉన్నారని బాధితురాలు పేర్కొంది. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

యువతకు అన్నింటా అవకాశాలు



మేళాకు హాజరైన యువత



జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్


- ఎంపీ, నగర వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్
- రాజమహేంద్రవరంలో మెగా జాబ్ మేళా

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యువతకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించి, వారి భవితకు బాటలు వేసిందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. బుధవారం స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్‌లో మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యువత భవిష్యత్‌కు భరోసా కల్పనకు నిర్వహించే జాబ్ మేళాలలో ఆయా కంపెనీలు అభ్యర్థులను ఎంపిక చేసుకుని, వారి పెర్ఫార్మెన్స్ బాగోలేదని ఒకటి రెండు నెలలకే తొలగించడం చాలా బాధాకరమన్నారు. ఎంపిక చేసుకునే ముందే అభ్యర్థులకు కంపెనీ నిబంధనలు తెలియజేయడంతో పాటు, వారికి లాకింగ్ పీరియడ్ ఆరు నెలలు ఉండాలని సూచించారు. తగు శిక్షణ ఇచ్చి, ఉద్యోగ భద్రత కల్పిస్తే జాబ్ మేళా నిర్వహణకు ఒక సార్థకత ఏర్పడుతుందన్నారు. ఈ జాబ్ మేళాకు సుమారు 150 కంపెనీలు హాజరు కాగా తూర్పు గోదావరి జిల్లా నుంచే కాకుండా కాకినాడ, కోనసీమ, ఏలూరు తదితర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. ఈ మేళాకు మొత్తం 3,247 మంది హాజరు కాగా, 1,021 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, రాజమహేంద్రవరం పార్లమెంట్ సమన్వయకర్త డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, డీఆర్డీఏ పీడీ ఎన్వీవీఎస్ మూర్తి, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కె.హరిశ్చంద్ర ప్రసాద్, డీఐసీ జీఎం బి.వెంకటేశ్వరరావు, ఏపీఎస్ఎస్డీసీ ఈడీ కె.దినేష్‌కుమార్, ప్లేస్‌మెంట్ మేనేజర్ కిరణ్ బొబ్బిలి, తూర్పు, పశ్చిమ, కాకినాడ, కోనసీమ, ఏలూరు, జేడీఎం జిల్లాల స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు ఎం.కొండలరావు, ఎ.కృష్ణారెడ్డి, డి.హరిశేషు, పి.లక్ష్మణరావు, జి.సుధాకర్, పి.కిరణ్‌కుమార్, నాయకుడు రావిపాటి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఓ మోసగాడు

నలభై ఏళ్ల రాజకీయాల్లో ఉన్న చంద్రబాబు ఓ మోసగాడని, ప్రజలను నమ్మించి మోసం చేయడమే ఆయన నైజమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. బాబు వస్తే జాబు గ్యారంటీ అని 2014లో టీడీపీ ఇచ్చిన స్లోగన్‌కు ప్రజలు ముఖ్యంగా నిరుద్యోగ యువత విశ్వసించి గెలిపించారన్నారు. బాబు అధికారంలోకి వచ్చారు.. చిన్నబాబు (లోకేష్)కు ఒకటి కాదు మూడు జాబులు వచ్చాయే కానీ రాష్ట్రంలో ఒక్క నిరుద్యోగికి కూడా జాబ్ రాలేదన్నారు. జాబు రాకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానని అన్నారని, అదీ ఇవ్వలేదన్నారు. డ్వాక్రా, రైతు రుణమాఫీ చేస్తానని చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించిందని, అభివృద్ధి చేసి చూపిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎంతో సమర్థవంతంగా అమలు చేశారని చెప్పారు. జగనన్న కోస్టల్ కారిడార్స్ నిర్మాణం, పోర్టుల ఏర్పాటు, ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్నారన్నారు. ప్రతి జిల్లాకు భారీ పరిశ్రమలు తీసుకొచ్చి ఆయా జిల్లాల్లో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. చంద్రబాబును సీఎం చేయడానికి పవన్‌కల్యాణ్ ఆరాటపడుతున్నారే తప్ప.. జనసేన శ్రేణుల ఆలోచనలు, ఆశలు, నిర్ణయాలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. చంద్రబాబుకు వృద్ధాప్యం వచ్చేసిందని, నేటి కాలానికి ఆయన రాజకీయాలు పనిచేయవన్నారు. ఎన్ని పార్టీలు కలసి వచ్చినా జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా విజయం సాధించడం ఖాయమన్నారు.

వికసిత్ భారత్ ఆశయాలను సాధించాలి



జీఐఎస్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు

రాజానగరం: స్వదేశీ సాంకేతికను వినియోగించుకుంటూ వికసిత్ భారత్ ఆశయాలను 2024 కంటే ముందుగానే సాధించాలని వికసిత్ భారత్ ప్రాజెక్టు అప్రైజల్ అండ్ మానిటరింగ్ కమిటీ– మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ చైర్మన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఇస్రో మాజీ డైరెక్టర్ డాక్టర్ వైవీఎన్ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నేషనల్ సైన్స్ డే సంబరాలు బుధవారం జరిగాయి. దీనికి విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ మానవ, ఆర్థిక సంబంధాలు శాస్త్ర సాంకేతిక రంగాలతో ముడిపడి ఉన్నాయన్నారు. సముద్రాల్లోని వాతావరణ పరిస్థితులను తెలియజేసేలా శాస్త్ర, సాంకేతిక రంగాలు అందిస్తున్న సేవలను వివరించారు. శాటిలైట్ నుంచి సముద్రంలో వెళ్లే జాలర్ల వరకూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్న తీరును తెలిపారు. చంద్రయాన్– 3, స్పేషియల్ డేటా, జీఐఎస్, ఐఓటీ, రిమోట్ సెన్సింగ్ వంటి వివిధ అంశాలను ప్రస్తావించారు. శాస్త్ర, సాంకేతిక రంగాలతో మానవ సంబంధాలు మరింత పెరగాలనే ఆకాంక్ష వెలిబుచ్చారు. వీసీ ఆచార్య కె. పద్మరాజు మాట్లాడుతూ సర్ సీవీ రామన్ గొప్పదనాన్ని వివరిస్తూ, ఆయనను ఆదర్శంగా తీసుకుని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకు సూచించారు. మానవాళిని చీకటి నుంచి వెలుగులోకి నడిపించేది సైన్స్ అన్నారు. పీఎం– ఉషా పథకంలో మంజూరైన రూ. 20 కోట్లతో యూనివర్సిటీలో సైన్స్ అభివృద్ధికి కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. సైన్స్‌కి సంబంధించిన కొన్ని నూతన కోర్సులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. డాక్టర్ కె.నూకరత్నం విద్యార్థులకు ఉపయోగపడే విధంగా రూపొందించిన పైథన్ ప్రోగ్రామింగ్ ఫర్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (జీఐఎస్) పుస్తకాన్ని ఆవిష్కరించి, ఆమెను అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కిర్లంపూడి: ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై బీఎస్వీఎస్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జగపతినగరం పంచాయతీ పరిధి నర్సరావుపేటలో నివాసం ఉంటున్న ఇసుకపల్లి వీరబాబు (39) కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఒక్కగాని ఒక్క కుమారుడి మృతితో వీరబాబు మనస్తాపం చెంది మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి ఇంట్లో తన భార్య లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు వచ్చి చూసేసరికి అప్పటికే మరణించాడు. అతని తండ్రి ఓం నమశివాయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వివరించారు.

ఆన్‌లైన్ మోసంపై ఫిర్యాదు

కాకినాడ రూరల్: ఆన్‌లైన్‌లో జరిగిన మోసంపై ఇంద్రపాలెం పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఎస్సై మణికుమార్ కథనం ప్రకారం.. కాకినాడ రూరల్ ఇంద్రపాలెం గ్రామానికి చెందిన పుప్పాల వీరవెంకట సత్యసురేంద్ర బ్యాంక్ ఉద్యోగిగా పదేళ్లు పనిచేశారు. తరువాత వేరే ఉద్యోగంలోకి మారారు. ఆన్‌లైన్‌లో వివిధ సంస్థల్లో పెట్టుబడులు పెట్టి సంపాదన అలవాటు చేసుకున్న సురేంద్ర గత ఏడాది జూన్‌లో టెలిగ్రామ్‌లో రెండు అకౌంట్లకు రూ.17,71,600 ట్రాన్స్‌ఫర్ చేశారు. తరువాత సొమ్ము తీసుకున్న వారి నుంచి ఎటువంటి జవాబు లేకపోవడంతో మోసపోయినట్టు గుర్తించి, డబ్బు రాబట్టుకునే ప్రయత్నం చాలా రోజులు పాటు చేశారు. చివరికి ప్రయత్నం విఫలమవ్వడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై మణికుమార్ కేసు నమోదు చేశారు.

ఏప్రిల్ 7న ఉగాది కవి సమ్మేళనం



కవి సమ్మేళన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్ తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం లయన్స్ క్లబ్ హాలులో వచ్చే ఏప్రిల్ 7వ తేదీన 132వ జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి వెల్లడించారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల, జిల్లా రచయితల సంఘాల ఆధ్వర్యంలో ఈ ఉగాది కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ కవి సమ్మేళనం జరుగుతుందని వివరించారు. స్థానిక కూచిమంచి అగ్రహారంలో ఈ కవి సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్ల ఆవిష్కరణ బుధవారం జరిగింది. శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జిల్లా శాఖ అధ్యక్షుడు నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘ అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ తదితరులు పోస్టర్లను ఆవిష్కరించారు. జాతీయ కవి సమ్మేళనంతోపాటు ఇదే వేదికపై కోనసీమ కవితోత్సవం కూడా జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి దాదాపు 150 మంది కవులు హాజరవుతారని డాక్టర్ ప్రతాప్ తెలిపారు. కవితాగానం చేసిన ప్రతి కవికి ప్రశంసా పత్రం, జ్ఞాపికతో పాటు సత్కరిస్తామన్నారు. పోస్టర్ల ఆవిష్కరణ అనంతరం పలు అంశాలపై కళా వేదిక ప్రతినిధులు చర్చించారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, రాష్ట్ర కార్యదర్శి బాలార్జున సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.